పేదల పెన్నిధి సీఎం జగన్


అర్హులకు సర్టిఫికెట్ అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్


జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

- 'జగనన్న సురక్ష' ద్వారా ఇంటికే సేవలు
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఏపీ సూక్ష్మ చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 59వ వార్డు మాజీ సైనిక కాలనీ వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలు సచివాలయాల పరిధిలో అర్హులైన వారికి నివాస, కుల,ఆదాయ తదితర ధ్రువ పత్రాలు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారి ఇంటి వద్దకే వివిధ ధ్రువ పత్రాలు అందిస్తున్నామన్నారు.

సేవల్లో ఆదర్శం

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రజలకు నేరుగా ఇంటికే పథకాలు అందిస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అన్నారు. పైసా లంచం లేకుండా, మధ్యవర్తుల వెంట తిరగకుండా ఉచితంగా ప్రభుత్వ సేవలను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం మన అందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ డి.వీరభద్రరావు, వివిధ విభాగాల అధికారులు, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు పార్టీ ఇన్‌చార్జి రేవళ్ల సత్యనారాయణ,ఎం.పెంటరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులు పరిశీలించిన జియ్యాని


సంజీవయ్యనగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు సంజీవయ్యనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. ఇక్కడి 80 అడుగుల రహదారి పనుల్లో భాగంగా సెంటర్ డివైడర్ ఇటీవల తొలగించారు. డివైడర్‌పై స్టీల్ రెయిలింగ్ వచ్చే విధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. వీధి రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని సూచించారు. నాణ్యతలో రాజీ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు డీఈ ఏడు కొండలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఈఆర్, డ్రాపవుట్స్ చేరికల ప్రక్రియ వేగవంతం


మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

సీతంపేట: గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌ను త్వరగా పూర్తి చేయాలని, డ్రాపవుట్ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అధికారులను డీఈవో చంద్రకళ ఆదేశించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం జీఈఆర్, డ్రాప్ అవుట్స్‌పై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ విషయమై ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలు, ఎంఆర్‌పీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతమ్మధార మండల విద్యాశాఖ అధికారులు బాలమణి, డి.రామారావు, సమగ్ర శిక్షణా అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ధనలక్ష్మీదేవి

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో అధిక శ్రావణ మాసం శుక్ల చతుర్థి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో పూజలు జరిగాయి. ధనలక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గాదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

దొండపర్తి: సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించిన రోజునే మహిళా సాధికారత సాధ్యమని డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేరీ సుజాత కంటిపూడి పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా 'మహిళా సాధికారత, శిశు సంరక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని సూచించారు. లింగ సమానత్వాన్ని సాధించకుండా మహిళా సాధికారత సాధ్యపడదని చెప్పారు. ముఖ్యంగా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, మానసిక శ్రేయస్సుకు మహిళల్లో శారీరక సాధికారత కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజినల్ మేనేజర్ ప్రఫుల్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ఎకో వైజాగ్'పై అవగాహన


సెబాస్టియన్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కళాకారులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని సెబాస్టియన్, బాబుకాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీవీఎస్ఎస్ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా నాట్యమండలి కళాకారులు తడి-పొడి చెత్త, ఎకో వైజాగ్, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, నాటకం స్థానికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలన్నారు. తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు వార్డు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ అర్జున్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహన చోదకుడికి కోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపిన వివరాలిలా.. ఇటీవల ఎన్‌ఏడీ బ్రిడ్జి వద్ద చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి గూడ్స్ వ్యాన్ నడుపుతున్న డ్రైవర్‌ను పట్టుకున్నారు. ఆ వ్యక్తికి మూడో స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, ఇన్‌చార్జి 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వై.గణపతిరావు రూ.10 వేలు జరిమానా విధించారు. కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఏడు కేసులకు గాను మొత్తంగా రూ.31,000 జరిమానా వసూలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే తగిన మూల్యం చెల్లించక తప్పదని సీఐ హెచ్చరించారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు


ఆటో డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ సుదర్శన్

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మల్కాపురం,శ్రీహరిపురం,సింధియా,కోరమాండల్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన వాహనాల తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్‌ఐ సుదర్శన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వాహనాల రికార్డులు పరిశీలించారు. వాహనాల్లో గంజాయి వంటివి ఏమైనా తరలిస్తున్నారా అన్న దానిపై తనిఖీలు నిర్వహించారు.పత్రాలు సరిగ్గా లేని వారిని,అనుమానితులను స్టేషన్‌కు తరలించారు.

ఆడారి ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు


ఆడారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న 89వ వార్డు కుల సంఘాల నాయకులు

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను శుక్రవారం 89వ వార్డుకు చెందిన పలు సామాజిక వర్గాల సంఘాల నాయకులు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గౌరీ సంఘం, ముస్లిం, రజక, విశ్వబ్రాహ్మణుల కోసం కల్యాణ మండపం, కమ్యూనిటీ హాల్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా ఆయనను వారు సత్కరించారు. బ్రాహ్మణులు, ఎస్టీలు తమ సమస్యలను ఆడారి దృష్టికి తీసుకెళ్లారు. నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఎస్టీలకు కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చేలా చొరవ చూపాలని కోరారు. వార్డులోని పలు సమస్యలు ఆయనకు తెలియజేశారు. గౌరీ సేవా సంఘం కోసం రూ.2 కోట్లతో కల్యాణ మండపం, ముస్లింలకు రూ.20 లక్షలు, చంద్రనగర్‌లో రజకులకు కల్యాణ మండపం, బోరు, విశ్వబ్రాహ్మణుల కల్యాణ మండపానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ మంజూరు చేయిస్తానని ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, వైఎస్సార్‌సీపీ నేత అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, షేక్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 56వ వార్డుకు చెందిన పలువురు నాయకులు వార్డులోని పలు సమస్యలను ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్


ప్రజలకు ఫ్రైడే-డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా: పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చని జోన్-5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ అన్నారు.62వ వార్డు దుర్గానగర్‌లో బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్సీ కృష్ణ, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలు ఖాళీ చేయడం ద్వారా సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. తడి-పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, డి.రాజ్‌కుమార్‌లతో పాటు మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ టమాటాకు బారులు


సబ్సిడీ టమాటాల కోసం వేచి ఉన్న వినియోగదారులు

గోపాలపట్నం: సబ్సిడీ టమాటాకు వినియోగదారులు బారులు తీరుతున్నారు. ఇక్కడి గోపాలపట్నం, మర్రిపాలెం రైతు బజారుల్లో శుక్రవారం వచ్చిన టమాటా కోసం వచ్చిన వారు క్యూలైన్లలో నిరీక్షించి మరీ కొనుగోలు చేశారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా రేటు భారీగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం కిలో రూ.50 కే రైతుబజార్లలో వినియోగదారులకు అందిస్తోంది. దీంతో వినియోగదారులు పోటెత్తుతున్నారు. శుక్రవారం గోపాలపట్నం రైతు బజారుకు 50 కేట్లు, మర్రిపాలెం రైతు బజారుకు 30 కేట్లు వచ్చాయి. కొద్ది గంటల్లోనే అయిపోయాయి. శనివారం కూడా సబ్సిడీ టమాటా అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

కంచరపాలెం రైతుబజారులో ..

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజారులో సబ్సిడీ టమాటా కోసం వినియోగదారులు గంటల సమయం బారులు తీరుతున్నారు. ఇక్కడ టమాటా విక్రయాలకు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే క్యూ లైన్లు కడుతున్న వినియోగదారులు కంచరపాలెం బీఆర్‌టీఎస్ సబ్‌వే రహదారిలోకి బారులు తీరారు. గంటల సమయం వేచి ఉన్న వినియోగదారులకు ఒక కిలో మాత్రమే రాయితీపై టమాటా ఇవ్వడంతో ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు, ఉద్యోగాలకు వెళ్లే సమయమంతా టమాటాల కోసం నిరీక్షించాల్సి వచ్చిందని వాపోయారు. సుమారు 13 క్వింటాళ్ల టమాటాలు విక్రయించినట్లు రైతుబజారు ఈవో కృష్ణమోహన్ తెలిపారు. వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా కౌంటర్లు ఏర్పాటు చేసి ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విక్రయించామన్నారు. మార్కెటింగ్ అధికారులు కంచరపాలెం రైతుబజారులో సబ్సిడీ టమాటా విక్రయాలను పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

ఏఎన్-32 విమాన ప్రమాదంలో అమరులకు నివాళి


అమరుల చిత్రాల బ్యానర్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్మికులు

గోపాలపట్నం: ఏడేళ్ల కిందట జరిగిన ఏఎన్ 32 విమాన ప్రమాదంలో అమరులైన 8 మంది ఎన్‌ఏడీ ఉద్యోగులకు శుక్రవారం ఎన్‌ఏడీ సీఈ యూనియన్ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నూకరాజు మాట్లాడుతూ 2016లో చెన్నై నుంచి అండమాన్‌కు ఏఎన్ 32 విమానంలో వెళ్తున్న సమయంలో గల్లంతయ్యారని తెలిపారు. సముద్రంలో విమానం కూలి పోవడంతో కార్మికుల ఆచూకీ తెలియరాలేదని వాపోయారు. ఏటా వారిని గుర్తు చేసుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో అస్మీభవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎన్‌ఏడీ కాలనీ గ్రౌండ్‌లో శనివారం క్రికెట్ టోర్నమెంట్ కూడా ప్రారంభించనున్నామని, ఇది ఈ నెల 30 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసు, వైస్ ప్రెసిడెంట్ డి. సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పశ్చిమ'ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్


రిబ్బన్ కట్‌చేసి సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 58వ వార్డు పరిధి శ్రీనివాస్‌నగర్‌లో సుమారు రూ. 50 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పైపులైన్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇదే ప్రాంతంలో సుమారు రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా 58వ వార్డులో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో వార్డులో చేసిన అభివృద్ధి శూన్యం అని విమర్శించారు.పల్లె అయినా పట్టణమైన అభివృద్ధి జరగాలంటే జగనన్నను మనమంతా మరో సారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, అధ్యక్షుడు కృష్ణ,నాయకులు శ్రీనివాస్ రాజు,అంగ రాంప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి,చుక్క వరలక్ష్మి,ఎదుర రాజు,సత్యవతి పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల సర్వే


జీవీఎంసీ 90వ వార్డులో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న బీఎల్‌వోలు


91వ వార్డులో ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న సచివాలయ కార్యదర్శి, బీఎల్‌వోలు


61వ వార్డు బాపూజీ కాలనీలో సర్వే చేస్తున్న సిబ్బంది


ప్రకాశ్‌నగర్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది


40వ వార్డులో ఓటరు సర్వేలో పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, బీఎల్‌ఏలు

గోపాలపట్నం: ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. పశ్చిమ నియోజకవర్గంలోని వార్డుల్లో బీఎల్‌వోలు సచివాలయ కార్యదర్శులు, రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పరిశీలిస్తున్నారు. ఆయా ఇంటి నంబర్లలో ఓటర్లు ఉన్నారా లేరా, ఆ ఓటరు ఎక్కడ ఉన్నారన్న అంశాలను ఆరా తీస్తున్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి వారి వివరాలు ఓటర్ గుర్తింపు కార్డు పరిశీలిస్తున్నారు. దీంతో బోగస్ ఓటర్లకు చెక్ పడనుంది. గోపాలపట్నం ఎన్‌ఏడీ ప్రాంతాల్లోని 90, 91, 92 వార్డుల్లో వెరిఫికేషన్ ప్రక్రియ మొదలైంది.

61వ వార్డులో..

మల్కాపురం: సచివాలయాల సిబ్బంది, బీఎల్‌వోలతో కలిసి సర్వే చేపట్టారు. 61వ వార్డు బాపూజీకాలనీ బూత్ నెంబర్ 125కు సంబంధించి చేపట్టిన ఓటరు సర్వేలో సచివాలయం సిబ్బంది, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న వారు ఆ ఇంట్లో ఉన్నారా లేదా కొత్త వారు ఉన్నారా..ఓటరు ఇతర ప్రాంతాల్లో ఉన్నారా అనే అంశాలపై ఆరా తీశారు. ప్రకాష్‌నగర్, మల్కాపురం తదితర ప్రాంతాల్లో ఓటరు సర్వే చేపట్టారు.జీవీఎంసీ 58,59,60వ వార్డుల పరిధిలో కూడా కార్యక్రమం ప్రారంభమైంది.

40వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని 165 బూత్ నెంబర్‌లో పరిధిలో శుక్రవారం ఓటరు సర్వే చేపట్టారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, సచివాయల వెల్ఫేర్ సెక్రటరీ రాజబాబు పాల్గొని ఓటరు జాబితా పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వార్డులోని ప్రతి గడపను పరిశీలించి, ఇంట్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారో, బోగస్ ఓట్లు ఏమైనా ఉన్నాయా అని విచారిస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌హన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ వరపల మహేష్, బీఎల్ఏలు సందీప్, గంగరాజు, బాబ్జి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలువ్యాపారాలు నిర్వహించుకోవడానికి శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితికి కొన్ని, మూడేళ్ల కాలపరిమితితో కొన్ని లీజు హక్కులు కల్పించారు. హెచ్చు మొత్తంలో పాడిన వారికి అధికారులు షాపులు ఖరారు చేశారు. సింహగిరిపై భక్తులకు ఫొటోలు తీసేందుకు ఏడాదికి రూ. 26.33 లక్షలు, కాఫీ,టీల విక్రయానికి రూ.42వేలకు ఖరారు చేశారు. సింహాచలం గురువారం సంతలో ఆశీలు వసూలుకు రూ.96వేలు, గోపాలపట్నం బుధవారం సంత మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలుకు లక్షా 43వేలు, కేశ ఖండనశాల వద్ద షాపు అద్దె నెలకు రూ.38వేలకు పాటదారులు దక్కించుకున్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లోని 68వ దుకాణానికి నెలకు రూ. 37వేలు, కొండదిగువ పురూరవ బిల్డింగ్‌లోని 29, 32 దుకాణాలకు నెలకు రూ.12,500 చొప్పున, పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడో నెంబర్ షాపునకు నెలకు రూ.10,400, ప్రహ్లాదపురంలోని షాపు నెంబర్ 8ని నెలకు రూ.3 వేల అద్దెకు ఖరారైంది. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏఈవోలు రమేష్, జంగం శ్రీనివాస్, సూపరింటెండెంట్ అప్పారావు, ఉద్యోగులు దొంతల రమణ తదితరులు వేలం పాటలు నిర్వహించారు.

కొనసాగుతున్న పోర్టు కార్మికుల దీక్షలు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు.

గరికిపాటి ప్రవచనాలు ప్రారంభం



ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభిస్తున్న గరికిపాటి నరసింహారావు

సీతమ్మధార: అల్లూరి సీతారామరాజు సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మనుచరిత్ర గురించి ప్రసంగించారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై ప్రవచించారు. శని, ఆదివారాల్లో సాయంత్రం 6 గంటల నుంచి ప్రవచనాల కార్యక్రమం జరుగుతుందని, భక్తులు, అభిమానులు తరలిరావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, చైర్మన్ ఎం.ఎస్.ఎన్.రాజు, సెక్రటరీ డి.ఎస్.పి.వర్మ, కోశాధికారి కె.శ్రీహరిరాజు, జాయింట్ సెక్రటరీ పి.వి.కె. హనుమాన్‌రాజు, ఈసీ మెంబర్లు, విజయ నిర్మాణ్ సంస్థ అధినేత విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


రీజినల్ డైరెక్టర్ ఉమా మహేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం సుసర్ల కాలనీ డీఏవీ పాఠశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. బ్రౌన్ బెల్ట్ పోటీల్లో డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బాలికల విభాగంలో ఏడుగురు, బాలుర విభాగంలో ఆరుగురు బ్రౌన్ బెల్ట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని డీఏవీ స్కూల్ రీజినల్ డైరెక్టర్ ఎం.ఉమా మహేశ్వరరావు అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడలపై ఉన్న ఆసక్తిని గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సేన్ సాయి, మేహన్ వంశి, కృష్ణప్రియలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.మహాదేవ శాస్త్రి ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.